
ప్రజాశక్తి
బుధవారం 15 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



నేడు నైతిక విలువలపై పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 'నీతి, నైతిక విలువలు' పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 24,675 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ నెల 17న 'పర్యావరణ విద్య' పరీక్ష నిర్వహిస్తున్నామని, దీనికి 24,614 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వెల్లడించారు. అనంతరం ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ఒకేషనల్ విద్యార్థులకు 20వ తేది నుంచి మార్చి ఏడో తేది వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 43,086 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. జనరల్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు 26 నుంచి మార్చి 7 వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటికి 43,878 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు.

భయంకరి

సుమారు 16 ఏళ్ల క్రితం ఒడిశా ప్రాంతం లకేరి అడవుల నుంచి గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతానికి 2006లో వచ్చిన ఏనుగుల గుంపు నేటికీ ఈ ప్రాంతాన్ని వీడలేదు. వందలాది ఎకరాల పంటలను నాశనం చేస్తూ, సుమారు 15 మందిని బలితీసుకున్నాయి. ఏనుగులను తరలించే క్రమంలో, వివిధ కారణాల రీత్యా పలు ఏనుగులు చనిపోగా, మరికొన్ని వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయాయి. ప్రస్తుతం కురుపాం నియోజకవర్గంలోని జియమ్మ వలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో ఉన్న నదీ ప్రవాహక ప్రాంతాల్లో ఏడు ఏనుగులు జనావాసాల మధ్య సంచరిస్తూ జన జీవనానికి తీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నాయి. తాజాగా భామిని, సీతంపేట ప్రాంతంలో కూడా సంచరిస్తున్నాయి.



కొండపై సంచరిస్తున్న ఏనుగులు (ఫైల్)

- వీడని ఏనుగుల బెడద
- దాడిలో ఇప్పటి వరకు 15 మంది మృతి
- నెల రోజుల వ్యవధిలో ముగ్గురు దుర్మరణం
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు



ఏనుగులదాడిలో మరణించిన ట్రాకర్ (ఫైల్)

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో గత కొన్నేళ్లగా ఏనుగుల సంచారంతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. అటు పంట నష్టం, ఇటు ప్రాణ నష్టం జరుగుతుండడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా బలిజిపేట మండలం చెల్లింపేటలో మంగళవారం తెల్లవారి ఓ వృద్ధుడిపై దాడి చేసి చంపేశాయి. దీంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏనుగుల దాడిలో గత 16 ఏళ్లలో ఇప్పటివరకు సుమారు 15 మంది వరకు గిరిజనులు, రైతులు మత్యువాత పడ్డారు. అయినా అటు అధికారులు, ఇటు పాలకులు ఏనుగులను తరలించడం, ప్రజలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. ఫ్యాక్టరీల పేరుతో అడవులను నాశనం చేయడంతో అడవిలో ఉండాల్సిన ఏనుగులకు రక్షణ కరువై, ఆహారం దొరక్క ఇలా జనావాసాల్లోకి వస్తున్నాయని అంటున్నారు. అడవుల్లో ఉండవలసిన వన్యప్రాణులు ప్రజల మధ్య తిరుగుతూ వారి ప్రాణాలను, పంటలను సర్వ నాశనం చేస్తూ జనజీవనానికి ఆటంకంగా మారాయి. దీంతో రైతులు పంట పొలాలకు వెళ్లలేక, ఇంటి వద్ద ఉండలేక బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏ క్షణానికి ఏనుగుల గుంపు గ్రామంపై దాడి చేస్తుందోనని ప్రజలు అనుక్షణం భయపడుతున్నారు. ఇదిలా ఉండగా భామిని మండలం లో గత కొన్నేళ్లు నుంచి నాలుగు ఏనుగులు ఉండగా, నేరడి బ్యారేజ్ సమీపంలో మరో ఆరు ఏనుగుల గుంపు రావడం కలకలం రేపింది. దీంతో వీటి సంఖ్య పదికి చేరింది. మరోవైపు బలిజిపేట మండలంలో కూడా ఏనుగుల గుంపు దాడులు చేస్తూ పలువురిని పొట్టన పెట్టుకుంటున్నాయి. ఏనుగులను తరలించే ప్రయత్నంలో కొద్దిరోజుల క్రితం కాలంలో భామిని సమీపంలో ఒక ట్రాకర్ కూడా మత్యువాత పడ్డాడు.

విఫలమైన ఆపరేషన్ గజ

అప్పటి అటవీశాఖ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో ఉన్న అడవి ఏనుగుల గుంపును ఒడిశా ప్రాంతానికి తరలించేందుకు ఆపరేషన్ గజ కార్యక్రమానిన ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు చేపట్టారు. తమిళనాడు నుంచి ట్రెనింగ్ పొందిన జయంతి అనే మగ ఏనుగును తీసుకువచ్చి అడవి ఏనుగులు గుంపును తరలించేందుకు పలు రకాలుగా ప్రయత్నాలు చేసినా అది పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదు. దీంతో ఆ కార్యక్రమానికి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టింది.

ప్రాణాలు తీసేస్తున్నాయి..

ఏనుగుల దాడి లో సుమారు 15 మంది వరకు మతి చెందడం ఆ కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఏనుగులు రోజుకొకరిపై దాడి చేస్తున్నా అటవీశాఖ అధికారులు మాత్రం రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. గుమ్మలక్ష్మీపురం ప్రాంతానికి వచ్చిన అడవి ఏనుగులు తొలిసారిగా బొడ్లగూడ సమీపంలో శాంతమ్మ గిరిజన మహిళను తొక్కి చంపేశాయి. ఈ సంఘటన జరిగిన వారం లోపే లుంబేసు పంచాయతీ వాడబాయి సమీపంలో ఉన్న కొండ పాక వద్ద ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వృద్ధులను, ఒక చిన్నారిని పొట్టన పెట్టుకున్నాయి. అదే క్రమంలో ఇరిడి గ్రామ సమీపంలో పెద్ద గూడ గ్రామానికి చెందిన గిరిజన వ్యక్తిని, చెముడు గూడ పంచాయతీ అడ్డం గూడ గ్రామానికి చెందిన బిడ్డిక సొంప అనే వృద్ధురాలు గెడ్డకి వెళ్లి వస్తుండగా గ్రామ సమీపంలోనే దాడి చేసి చంపాయి. వీరఘట్టం మండలం హుస్సేన్ పురంలో న్యూస్ కవరేజ్ కి వెళ్లిన విలేకరిపై దాడి చేసి ప్రాణాలు తీశాయి. ఇటీవల భామిని మండలం ఘనసర వద్ద చిన్నారావు అనే రైతును, ఏనుగులను తరలించే క్రమంలో పసుకుడి గ్రామ సమీపంలో ఎలిఫెంట్ కేర్ ట్రాకర్ లోకుండ లక్ష్మీనారాయణను పొట్టన పెట్టు కున్నాయి. ఇది మరువకముందే బలిజిపేట మండలం చెల్లింపేట గ్రామంలో అడప దేశినాయుడు అనే వద్ధుడు పై ఏనుగులు దాడి చేసి ప్రాణాలు తీశాయి. జియమ్మ వలస, కొమరాడ మండలాల్లో కూడా పలువురుపై దాడి చేసి ప్రాణాలు తీయడమే కాకుండా, రైతులు పండించుకున్న పంటలను, వాటర్ మోటార్లను, అంగన్వాడీ భవనం తలుపులు ధ్వంసం చేశాయి.

ఏనుగులను తరలించాలి



మన్యం జిల్లాలో ప్రజల ప్రాణాలను తీస్తున్న అడవి ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి ఒడిశా ప్రాంతానికి తరలించే విధంగా ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. ఏనుగుల దాడితో విలువైన ప్రాణాలు, పంట నష్టం, ఆస్తి నష్టం జరుగుతున్నా ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

- కోలక అవినాష్, ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ప్రజలను కాపాడాలి



పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న అడవి ఏనుగుల గుంపు బారి నుంచి ప్రజలను ప్రభుత్వం కాపాడే చర్యలు చేపట్టాలి. ఏనుగుల సంచారంతో రైతులు పంట పొలాలకు వెళ్లలేని పరిస్థితి. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించాలి.

- తోయక జగదీశ్వరి, టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి

ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

మన్యం జిల్లాలో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం పార్వతీపురం పరిసర ప్రాంతం , కొమరాడ మండలం అర్తం, సాలూరు మండలం జంతి కొండ పరిసర ప్రాంతాలలో ఎలిఫెంట్ జోన్ కోసం బృంద సభ్యులు పరిశీలన చేయడం జరిగింది. ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు సుమారు రూ.70 కోట్ల అవసరం ఉంటుంది. కేంద్రం నుంచి అనుమతులు వస్తే పనులు చేపట్టేందుకు వీలుంటుంది.

- రాజా బాబు, కురుపాం అటవీ శాఖ రేంజర్

ఎమ్మెల్యేల్లో గుబులు



- ఇంటింటికీ వెళ్లకపోతే చర్యలు తప్పవంటున్న వైసిపి అధినేత జగన్
- ముగ్గురి పనితీరు బెటర్
- అప్పలనర్సయ్య సహా మరో ఇద్దరి స్థితి అధ్వానం
- మధ్యస్థంగా మరో ముగ్గురు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వైసిపి అధినేత, సిఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీ సమీక్షలో తీసుకున్న నిర్ణయం ఎమ్మెల్యేల్లో గుబులు పుట్టిస్తోంది. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ పార్టీలో తీసుకున్న నిర్ణయాలపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తూ హెచ్చరిస్తున్న విషయం విదితమే. 'గడపగడపకు మన ప్రభుత్వం' అనే కార్యక్రమంపై తాజాగా చేసిన సమీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని స్పష్టం చేశారు. వారిలో గజపతినగరం ఎమ్మెల్యే పేరు కూడా వినిపించడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఆయన వ్యాపారాలు, వ్యక్తిగత పనులకు ఇస్తున్న ప్రాధాన్యత పాలనకు, పార్టీకి ఇవ్వడం లేదనే నివేదిక హైకమాండ్‌కు వెళ్లినట్టుగా రాజకీయ నాయకుల్లో చర్చ నడుస్తోంది. గతంలో పలువురు మంత్రులతోపాటు బొత్స సత్యనారాయణను కూడా సిఎం హెచ్చరించారు. ఆ తరువాత నియోజకవర్గంలో కొంత హడావుడి చేసినా అది సభలు, సమావేశాలు మాత్రమే. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ కూడా పెద్దగా తిరగడం లేదంటూ పార్టీకి ఫీడ్‌బ్యాక్ వెళ్లిందట. ఈ ముగ్గురి సంగతి కాస్త పక్కనబెడితే ఉమ్మడి విజయనగరం జిల్లాలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అందరికన్నా ఎక్కువగా పాల్గొన్నట్టుగా పార్టీ నివేదిక స్పష్టం చేసినట్టు సమాచారం. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కొంత నయంగానే పాల్గొంటున్నారని తెలిసింది. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా జగన్ ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్‌లో బొటాబొటిగా పాసయ్యారట. పేరు చెప్పక పోయినప్పటికీ ఒక మాజీ మంత్రి కదలకపోవడంపై జగన్ గుర్రుగానే ఉన్నట్లు చర్చ నడుస్తోంది. పార్టీ నిర్ణయం ప్రకారం ప్రతి ఇంటికీ ఎమ్మెల్యేలు వెళ్లకపోతే సమన్వయకర్త బాధ్యతల నుంచి తప్పిస్తామని హెచ్చరించినప్పటికీ మంత్రులు, మాజీ మంత్రులకు అది వర్తింపజేసే పరిస్థితి ఉండకపోవచ్చని నాయకుల్లో చర్చ నడుస్తోంది. మంత్రుల విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తే బొత్స వంటివారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, అదే పరిస్థితి ఏర్పడితే పార్టీలో డొల్లతనం బయటపడినట్టేనని, అంతదాకా జగన్ తెచ్చుకోరని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉండాలన్న జగన్ నిర్ణయం మంచిదైనప్పటికీ, వయసు, ఆరోగ్యం రీత్యా అంతా ఒకటే మాదిరిగా తిరిగే ప్రసక్తి లేదని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి వచ్చే ఎన్నికల ప్రచారంలోపే ప్రభుత్వంపై ప్రజల అభిమానం, వ్యతిరేకత స్పష్టంగా తెలియాలని, ఈ సందర్భంగా బయటపడ్డ ప్రజానాడితో పార్టీ బలోపేతానికి, ఎన్నికలకు సిద్ధపడాలని అధిష్టానం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

జిల్లా కేంద్రాస్పత్రిలో అన్ని వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రాసుపత్రిలో అన్ని రకాల వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రాస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తన అమ్మమ్మ కోరాడ రాములమ్మ మరణించిందని జొన్నవలస గ్రామ యువకుడు వంశీ ఆవేదనతో ఆసుపత్రి వద్ద నిరసన తెలిపాడని, వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశాడని తెలిపారు. కనీస అవసరాలు తీర్చే సామగ్రి కూడా లేకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ మరణానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని సిపిఎం ఖండిస్తోందని తెలిపారు. తక్షణమే ప్రజారోగ్య రక్షణకు అవసరమైన పూర్తి ఆరోగ్య పరికరాలు ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న డిఐజి హరికృష్ణ

ఎస్ఐ రాతపరీక్షకు పటిష్ట భద్రత

డిఐజి హరికృష్ణ

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్ఐ ఉద్యోగ నియామకాలకు ఈ నెల 19న నిర్వహించే ప్రిలిమినరీ రాతపరీక్ష కేంద్రాలను మంగళవారం విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ సందర్శి ంచారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను పర్యవేక్షించారు. పేపర్లను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐ ఉద్యోగ నియామకాల కోసం నిర్వహించే ప్రిలిమినరీ రాత పరీక్షలో ఎటువంటి అవకతవకలు జరగకుండా నిర్వహించేందుకు అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని డిఐజి సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

కాలేజ్ యాజమాన్యాలు చేపట్టిన చర్యలను కళాశాలల అధికారులు, ప్రిన్సిపల్స్ ఆయనకు వివరించారు. వారికి పలు భద్రత పరమైన సూచనలు డిఐజి చేశారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాస రావు, ట్రాఫిక్ డిఎస్‌పి ఎల్.మోహన రావు, సిఐలు జి.రాంబాబు, టివి తిరుపతిరావు, బి.వెంకట రావు, సిహెచ్.లక్ష్మణ రావు, ఎస్ఐ గణేష్ పాల్గొన్నారు.

నాగవంశీయులను మోసగించిన చంద్రబాబు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇప్పటివరకు ఎటువంటి ఉన్నత పదవులనూ అలంకరించని నాగవంశీయలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానం కల్పిస్తామని ప్రకటించిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వారిని మోసం చేసి బిసిల ద్రోహిగా మరోసారి నిరూపించుకున్నారని నాగవంశం నాయకులు అవనాపు విజయ్, గాడు అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని అవనాపు స్వగహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో భీమిలికి చెందిన గాడు చిన్నికుమారిని టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించడంతో నాగవంశీయులంతా ఎంతో ఆనందించామన్నారు. ఎన్నికలు సమీపించిన సమయంలో చిన్నికుమారికి బదులుగా వేరొకరికి ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించి చంద్రబాబు బిసి ద్రోహిగా మరోసారి నిరూపించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు నాగవంశ కులానికి చెందిన ఏ ఒక్కరూ ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ వంటి ఉన్నత పదవులను చేపట్టలేదని తెలిపారు. సమావేశంలో నాగ వంశ కుల పెద్దలు బేరి సత్యనారాయణ, హంస శ్రీను, మద్దిల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై విఆర్ఎల ధర్నా

ప్రజాశకి-విజయనగరం టౌన్

గ్రామ రెవెన్యూ సహాయకులకు ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కలెక్టరేట్ వద్ద విఆర్ఎల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ విఆర్ఎలకు ముఖ ఆధారిత హాజరును వర్తింపచేయటం సరికాదని అన్నారు. విఆర్ఎలంతా పార్ట్ టైమ్ వృత్తిగా పనిచేసే ఉద్యోగులు మాత్రమేనని, ప్రభుత్వం వారికి గౌరవ వేతనం మాత్రమే ఇస్తోందని అన్నారు. అతి తక్కువ వేతనం వచ్చే విఆర్ఎలకు సెల్‌ఫోన్లు కొనుగోలు చేసుకునే స్థోమత కూడా లేదని పేర్కొన్నారు. విఆర్ఎల్లో నిరక్షరాస్యులు కూడా ఉన్నారని, వీరికి స్మార్ట్ ఫోన్ వాడకమే తెలియదన్నారు. చాలా మందికి సాంకేతిక పరిజ్ఞానం కూడా లేదన్నారు. 2018లో కూడా టిడిపి ప్రభుత్వం విఆర్ఎలంతా బయోమెట్రిక్ హాజరు వెయ్యాలనే నిబంధన తీసుకువచ్చినప్పుడు కూడా ఆచరణ సాధ్యం కాదని యూనియన్ చేసిన విజ్ఞప్తి మేరకు బయోమెట్రిక్ నుండి మినహాయింపు ఇచ్చారని తెలిపారు. ఫేస్ యాప్ ద్వారా హాజరు వేయడం వల్ల కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని విఆర్ఎలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, లేదా పేస్కేల్ ఇవ్వాలని, డిఎతో కూడిన వేతనం ఇవ్వాల డిమాండ్‌చేశారు. రికవరీ జిఒను ఉపసంహరించాలని, విఆర్ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. భూ సర్వే సందర్భంగా టిఎ, డిఎలు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జెసి మయూర్ అశోక్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో విఆర్ఎ సంఘం జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకన్న, రాంబాబు, ప్రసాద్, బద్రి, మంగమ్మ, మహేష్, రామస్వామి, అశోక్, అప్పారావు, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విఆర్ఎలు

సాయానికి వెళ్లి మృత్యువాత

ప్రజాశక్తి-బొబ్బిలి

సహాయం చేసేందుకు వెళ్లి మృత్యువాత పడిన సంఘటన మండలంలోని జగన్నాథపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన సువ్వాడ భారతి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. పేపర్ ప్లేట్లు యంత్రం తెప్పించడంతో బడ్డీలో పెట్టేందుకు స్థానికులను సహాయం చేయాలని కోరారు. రోడ్డుపై ఉన్న మిషన్‌ను షాపులో పెట్టేందుకు ఆరుగురు ముందుకు వచ్చారు. బడ్డీలోకి మిషన్ పెడుతుండగా అందులో ఉన్న విద్యుత్ వైర్ మిషన్‌కు తగిలి షాక్ కొట్టడంతో సహాయం చేసిన కింతలి రవి (48) అక్కడికక్కడే మరణించగా మరో ఐదుగురు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్ద కుమార్తె వివాహం జరగక ముందే..

కింతలి రవి పెద్ద కుమార్తె అఖిల వివాహం నిర్ణయించారు. కట్నం, వివాహ ఖర్చులకు డబ్బులు బెత్తాయిస్తున్నారు. ఇంటిపై లోన్ పెట్టి, ఆ డబ్బులు వచ్చిన వెంటనే వివాహం చేయాలని అనుకున్నారు. ఈలోగా రవి మరణించడంతో భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమవుతున్నారు. రవి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రవి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరుతూ బొబ్బిలి-బలిజిపేట రహదారిపై కుటుంబ సభ్యులు, బంధువులు నిరసన తెలిపారు. రవి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు పరిహారం చెల్లించేందుకు అంగీకరించారు.



రోడ్డుపై నిరసన చేపడుతున్న రవి కుటుంబసభ్యులు, బంధువులు

ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడులు ఆపాలని నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్‌పై పోలీసులు దాడి చేయడానికి వ్యతిరేకంగా మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ కృష్ణా యూనివర్సిటీ పరిధిలో సమస్యలను ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. బాలికల హాస్టల్‌లో సరైన మౌలిక సదుపాయాలు కూడా లేవన్నారు. రెండు రోజుల క్రితం కృష్ణా యూనివర్సిటీ పరిధిలో ఇద్దరు విద్యార్థునులు విద్యుత్ షాక్‌కు గురైన నేపథ్యంలో వారికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతుంటే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్‌పై దాడి చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో కొత్త భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర నాయకులు, విద్యార్థులు ఆందోళన చేస్తే సమాధానం చెప్పలేక పోలీసులను ఉపయోగించి దాడి చేయడాన్ని ఖండించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీ యాజమాన్యంపైనా, పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్.రామకృష్ణ, జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఎం.సౌమ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్ కుమార్‌పై కృష్ణ యూనివర్సిటీలో పోలీసులు చేసిన దాడిని ఖండిస్తూ ఎస్.కోట మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం దేవీ బొమ్మ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మచిలీపట్నంలో గల కృష్ణా యూనివర్సిటీలో పూర్తికాని భవనాల్లో క్లాసులు నడపడం వల్ల ఇద్దరు విద్యార్థినులకి విద్యుత్ షాక్ తగలడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని, విద్యార్థులకు న్యాయం చేయాలని శాంతియుతంగా కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీలో కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులపై, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్‌ని బట్టలు ఊడబీకి, మెట్లుపై ఈడ్చి కిందకి లాగి దాడి చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిచామన్నారు. యూని వర్సిటీలో విద్యార్థులకి సరైన తరగతి గదులు, మౌలిక సదుపాయాలు కల్పించమంటే సమస్యలు పరిష్కరించలేని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సమస్యలు అడిగిన విద్యార్థులు, నాయకులపై మాత్రం దాడులు చేయిస్తున్నారన్నారు. ఎవరైతే పవన్ పై దాడికి దిగిన పోలీసులు ఉన్నారో వాళ్ళపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష, మండల కార్యదర్శి రమేష్, పైడి తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు నోడల్ అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు జిల్లాలో నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో వివిధ రకాల పనులను, విభాగాలను ఈ నోడల్ అధికారులు పర్యవేక్షించనున్నారు.

మేన్‌పవర్ మేనేజ్‌మెంట్	పి.బాలాజీ (సిపిఒ)	9849901472
ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్	వి.సుందర్ (ఆర్‌టిఒ)	9154294102,
	కె.శ్రీనివాసరావు(డిపిటిఒ)	9959225604
ట్రైనింగ్ మేనేజ్‌మెంట్	కె.పద్మలత (ఎస్‌డిసి)	9063414109
	అరుణకుమారి(తహశీల్దార్)	8333813260
మెటీరియల్ మేనేజ్‌మెంట్	బి.సుధాకరరావు (మెప్మా పీడీ)	8309780269
మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్	సూర్యనారాయణ(ఎస్‌డిసి)	9000981228
పరిశీలకులు	బి.ఉమాశంకర్ (ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ)	9100120700
	జి.ఉమాపరమేశ్వరి (డ్వామా పీడీ)	9154084948
శాంతిభద్రతలు	అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్)	
	అశోక్‌కుమార్ (జెడ్‌పి సిఇఒ)	9491035889
బ్యాలెట్ పేపర్స్	డి.వెంకటేశ్వరరావు (ఎస్‌డిసి)	9951769805
మీడియా, కమ్యూనికేషన్	డి.రమేష్ (డిఐపిఆర్ఒ)	9121215261
హెల్ప్‌లైన్, ఫిర్యాదులు	ఎ.కల్యాణచక్రవర్తి (డిఆర్‌డిఎ పీడీ)	8897211135
ఫుడ్, స్నాక్స్ మేనేజ్‌మెంట్	కె.మీనాకుమారి (సివిల్ సప్లై డిఎం)	9963479142
లైవ్ వెబ్‌కాస్టింగ్	బి.సుదర్శనదొర (ఎస్‌డిసి)	9494326124

రిజర్వ్ అధికారులు : బి.పద్మావతి (డిపిఎం) 9100124602, ఎవిఎస్‌వి జమదగ్ని (డిహెచ్ఒ) 7995086762, పి.లక్ష్మీనారాయణ (ఎపిఎంఐపి పీడీ) 7995087037

విశాఖ డెయిరీ రైతులకు దుప్పట్లు పంపిణీ

రామభద్రపురం : మండల కేంద్రంలో ఉన్న విశాఖ డెయిరీ పాల కేంద్రంలో పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులకు ఆ సంస్థ అధ్యక్షులు చొక్కాపు రామకృష్ణ చేతుల మీదుగా దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా సంక్రాంతి సందర్భంగా డెయిరీ ఆధ్వర్యంలో కానుకల రూపంలో వస్తు పంపిణీ చేయడం ఆనవాయితీ అని ఈ ఏడాది కూడా అదే సాంప్రదాయాన్ని పురస్కరించుకుని దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వేతన కార్యదర్శి చొక్కాపు లక్ష్మణ, సిబ్బంది ఎర్రం నాయుడు, జనార్దన్, పోలి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో వాస్తవాలను వెల్లడించాలి

గజపతినగరం : వివేకానందరెడ్డి హత్య కేసులో వాస్తవాలను వెంటనే వెల్లడించాలని మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందరెడ్డి క్రూర హత్య కేసులో సూత్రధారులు ఎంత పెద్ద స్థాయిలో ఉన్న వారికి శిక్ష పడకపోతే నరహంతకులు విచ్చలవిడిగా రెచ్చిపోతారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలందరికీ ఆగ్రహమొచ్చే వాస్తవాలతో కూడిన జగనాసుర రక్తచరిత్ర అనే పుస్తకాన్ని ప్రజల కోసం విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మి నాయుడు, సీనియర్ నాయకులు రాంజీ రాజు, వేమలి చైతన్య బాబు, లెంక బంగారు నాయుడు, ప్రదీప్ కుమార్, కోడి సతీష్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ

రామభద్రపురం : స్థానిక భవిత కేంద్రంలో చదువుతున్న వికలాంగ విద్యార్థులకు బూసాయవలస గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర బోర్ వెల్స్ యజమాని మచ్చుల్ల శ్రీనివాసరావు, అనూషా దంపతులు వివాహ వార్షికోత్సవం సందర్భంగా రూ.10వేల విలువగల నిత్యావసర వస్తువులు, భోజన సామాగ్రిని మంగళవారం ఎంఇఒ తిరుమల ప్రసాద్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ చింతల రాజేశ్వరి, అప్పలరాజు, వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు పూటలా పనిచేయాలి: ఎంపిడిఒ

నెల్లిమర్ల : ఉపాధి హామీ పనులను రెండు పూటలా చేయాలని అలా చేస్తేనే కూలీ గిట్టుబాటు అవుతుందని ఎంపిడిఒ జి. గిరిబాల అన్నారు. మండలంలోని చినబూరాడపేట, పెదబూరాడ పేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల్లో అక్రమాలు జరగకుండా సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా పనులు జరిగినప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు, జాబ్ కార్డులు పరిశీలించడంతో పాటు కొలతలు సక్రమంగా కొలవాలన్నారు. ఈ పరిశీలనలో ఆమె వెంట ఎపిఒ జి. అరుణకుమారి తదితరులున్నారు.

పాఠశాలల పరిశీలన

వేపాడ : మండలంలోని వావిలిపాడు, ఎస్‌కెఆర్ పురం పాఠశాలలను ఎంఇఒ జి. శ్రీదేవి మంగళవారం పరిశీలించారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు నేడు రెండో విడత పనులను పరిశీలించడంతో పాటు ఒకటి, రెండు తరగతి విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. బైజూస్ ట్యాబ్ వినియోగం, వాడే విధానాన్ని విద్యార్థులను అడిగారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్‌లో జపాన్ ముందంజ : విసి

నెల్లిమర్ల : రెండో ప్రపంచ యుద్ధం అనంతరం జపాన్ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో అద్భుత ప్రగతి సాధించిందని విసి ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. మంగళవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జపాన్‌కు చెందిన కెనిచి ఇషికవా మాట్లాడుతూ జపాన్‌లో యువత కంటే వృద్ధుల శాతం అధికంగా ఉందన్నారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్‌లో వృద్ధులకు అమలు చేస్తున్న పథకాల కోసం తాము భారతీయ బ్యాంకింగ్ రంగాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం పూర్వ విద్యార్థి సన్యాసిరావు, జపాన్‌కు చెందిన యోషియాకి ఆసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, డీన్ సన్నీ డియోల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలి

గర్ల : గ్రీన్ అంబాసిడర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పి.అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గ్రీన్ అంబాసిడర్లతో కలిసి ఆయన సమస్యల పరిష్కారం కోసం ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందించారు. 6 నెలలుగా జీతాలు అందకపోవడంతో తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పంచాయతీలలో డబ్బులు లేవని అధికారులు చెబుతున్నారని, తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

పొదుపు సంఘాలతో సమావేశం

వేపాడ : మండలంలోని కుంపల్లి గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ ఎస్ అరుణ అధ్యక్షతన పొదుపు సంఘం మహిళా గ్రూపులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి డి. సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం గ్రామైక్య సంఘాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గ్రామ సచివాలయ కన్వీనర్ శ్రీను, దొగ్గ సన్యాసి, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, మహిళా గ్రూపు సభ్యులు, గ్రూపు లీడర్లు, సచివాలయ సిబ్బందితో పాటు ఎపిఎం రంగుల శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పనుల్లో జాప్యం తగదు

రేగిడి : మనబడి, నాడు- నేడు నిర్మాణ పనుల్లో జాప్యం తగదని ఎంఇఒ ఎం.వరప్రసాద్ రావు, సమగ్ర శిక్ష జెఇ దాలయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం కోడిశ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులు వారు పరిశీలించారు. నిర్దేశించిన సమయానికే పనులు పూర్తి చేసి అందించాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఎస్ఎంసి కమిటీ నిర్మాణ పనుల పర్యవేక్షణ చేయాలని సూచించారు. వీరితోపాటు పిఎసిఎస్ రేగిడి అధ్యక్షులు నెల్లి పెంట నాయుడు, ప్రధానోపాధ్యాయులు ఎస్ రవిరాజు ఉన్నారు.

'పుల్వామా' అమరులకు ఘన నివాళి

బొబ్బిలి : పుల్వామా సంఘటనలో అమరులైన వీరజవానుల చిత్ర పటాలకు మంగళవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద బొబ్బిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ జై భీమ్ నివాళులు అర్పించారు. స్థానిక న్యాయవాదులు బిఎస్ఆర్ మూర్తి, తుమరాడ గంగాధర్, మాస్ బాలు యాదవ్, బొబ్బిలి నియోజకవర్గం మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రెడ్డి దామోదర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సెబ్ సిఐ మాట్లాడుతూ అమరులైన జవానులు జాతి రక్షణ కోసం వారి ప్రాణ త్యాగాలు చరిత్రలో మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ

భోగాపురం : ఆలయ నిర్మాణానికి నెల్లిమర్ల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కర్రోతు బంగార్రాజు రూ. 50వేలు విరాళాన్ని మంగళవారం పోలిపల్లి గ్రామంలో అందజేశారు. నెల్లిమర్ల మండలం అలుగోలులో పైడిమాంబ తల్లి అమ్మవారి ఆలయం నూతన నిర్మాణం కోసం ఆయన కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు అట్టాడ బాబూరావు, డీలర్ కెల్ల నారాయణ అప్పలనాయుడు, కెల్ల పాపారావు, కెల్ల రమేష్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

జామి : మండలంలోని భీమసింగిలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించగా, పంచాయితీ నలుమూలల నుండి 60 మందికి పైగా రోగులు హాజరై, కంటి వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఇందులో 15 మందికి శస్త్ర చికిత్సలు వైద్యులు శ్రీకాంత్ ఎంపిక చేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు నెటర్ జోగారావు, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

బొబ్బిలి : బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పట్టణ పిఒ విజయకుమారి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ మహిళా పోలీసులు, మహిళా వాలంటీర్లు, అంగన్వాడీ సిబ్బందితో సఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21 ఏళ్ల లోపు పిల్లలకు వివాహం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాల నివారణకు పని చేయాలని కోరారు. ఆడపిల్లలను, మహిళలను కించపరిచిన, లైంగిక వేధింపులకు పాల్పడిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైకిల్ తొక్కితే వ్యాధులు దూరం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

సైకిల్ తొక్కడం వల్ల ఎన్నో హృదయ సంబంధిత వ్యాధులు దూరమవుతాయని బొద్దాం పిహెచ్‌సి వైద్యులు సతీష్ కుమార్ తెలిపారు. సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా తిమిడి గ్రామ సర్పంచ్ వబ్బిన త్రినాధమ్మ ఆధ్వర్యంలో మంగళవారం తిమిడి గ్రామంలో సైకిల్ ఫర్ హెల్త్ రీ సైకిల్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్ తొక్కటం వల్ల కేన్సర్, మధుమేహం వంటి వ్యాధులను నివారించవచ్చునని దీంతో పాటే హృదయ సంబంధిత వ్యాధులు కూడా దూరమవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత వబ్బిన సతీష్, గ్రామ పెద్దలు కారుకొండ వెంకటరావు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీలు, హై స్కూల్ సిబ్బంది, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఆశాలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ. ధరణి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్ ర్యాలీ వల్ల ఏఏ వ్యాధులను అరికట్ట వచ్చుననే విషయాన్ని నినాదాలు ద్వారా తెలిపారు. ప్రధానంగా కేన్సర్ వ్యాధిని అదిగమించవచ్చునని, శారీరక



వేపాడ: మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

బరువును నియంత్రించవచ్చునని, రక్తపోటును నియంత్రించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్, ఆంజనేయులు, హెల్త్ సూపర్వైజర్ వెంకట్రావు, అసిస్టెంట్ సూపర్వైజర్ డి సత్యనారాయణ, సుధానాయుడు, వైద్య కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం పురవీధుల్లో కేన్సర్‌పై ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఎమ్ఎల్‌హెచ్‌పిఎన్ దుర్గాదేవి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేన్సర్ పై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైక్లింగ్ ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అవగాహన కల్పించారు. వీరితోపాటు ఆశా కార్యకర్తలు సుశీల, నాగమణి, సుజాత ఉన్నారు.

భోగాపురం: ప్రస్తుతం కేన్సర్ మహమ్మారి వ్యాపిస్తోందని అందరూ అప్రమత్తంగా ఉండాలని పోలిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి తిరుపతి స్వామి అన్నారు. కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ సైకిల్ తొక్కడం నిత్యం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సూపర్‌వైజర్లు సుధాకర్, ఏయన్ఎంలు పద్మావతి, కె.అరుణ..హెల్త్ అసిస్టెంట్ రమణ, ఎంఎల్‌హెచ్‌పిలు దుర్గా మహాలక్ష్మి, గౌరీ పాల్గొన్నారు.

కొత్తవలస: వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో గల తుమ్మికాపల్లి, వీరభద్రపురం, దేవాడ, ముసిరామ్, నిమ్మలపాలెం, ఉత్తరపల్లి, రామలింగాపురం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్‌లో గర్భాశయ కేన్సర్‌పై ఎం.ఎల్.హెచ్.పిలు, ఏ.ఎన్.ఎమ్స్, ఆశ వర్కర్స్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్, స్కూల్ పిల్లలతో సైకిల్ మారతాన్ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్ఎన్ జగదాంబ మాట్లాడుతూ మహిళలలో నెలసరి సమయంలో పరిశుభ్రత లోపం, వైట్ డిశ్చార్జ్, ఓవర్ బ్లీడింగ్, వ్యక్తిగత పరిశుభ్రత లోపం వల్ల, బాల్య వివాహాలు వల్ల, ఆహార అలవాట్లు, జీవన శైలి, జంక్ ఫుడ్స్ వల్ల, శరీరక వ్యాయామం లేకపోవడం వల్ల, హార్మోన్స్ ఇమ్ బాలన్స్ వలన క్యాన్సర్స్ వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిహెచ్‌ఈఓ గోవిందరాజులు, హెచ్.వి. పద్మావతి, హెచ్.ఎస్.రాము, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

రామభద్రపురం : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రభావంతో నూతన పాలసీలు లేకుండా కేవలం వివిధ శాఖల అధికారుల సమీక్షలతోనే సమావేశం ముగిసింది. ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు హాజరై సమీక్షించారు. తొలుత నాడు నేడు డిఇ మాట్లాడుతూ మండలంలో 21 స్కూల్స్‌లో ఫేజ్ 2 నాడు నేడు కింద రూ. 7.44 కోట్లతో చేసిన అభివృద్ధి పనులు జరిగాయన్నారు. విద్యాశాఖపై జరిగిన సమీక్షలో ఎంఈవో తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన మెనూ పక్కాగా అమలు చేసేలా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఎఒ వెంకటయ్య మాట్లాడుతూ రబీలో అపరాల విత్తనాలు రాయితీ పై పంపిణీ చేశామన్నారు. జగనన్న గృహ నిర్మాణాలపై జరిగిన సమీక్షలో మామిడివలస టిడిపి ఎంపిటిసి మడక తిరుపతి నాయుడు అధికారుల తీరుపై మండి పడ్డారు. ఆ శాఖ డిఇ కనీసం మంజూరైన ఇళ్ల వివరాలు కూడా వివరంగా చెప్పలేక పోవడంతో వేదిక పై ఉన్న ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పారదర్శకంగా ప్రభుత్వం పేద వాడికి గూడు కల్పిస్తుందని చెప్పే మాటలకు అర్థం లేకుండా గృహ నిర్మాణశాఖ నిర్లక్ష్య వైఖరికి ఇదే నిదర్శనమని తిరుపతి రావు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు కూడా ప్రజాప్రతి నిధులుకు సహకరించడం లేదని రొంపల్లి ఎంపిటిసి బవిరెడ్డి వెంకట రమణ ధ్వజమెత్తారు. విఆర్ఒ స్థాయి అధికారులు కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నారని ప్రజా ప్రతినిధులతోనే ఇలా ఉంటే సాధారణ పౌరుల పరిస్థితి ఏమిటి? అని నిలదీశారు. ఎంపిటిసి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు

మడక తిరుపతి నాయుడు కలుగ జేసుకొని రేషన్ డీలర్లు బయో మెట్రిక్ ద్వారా వేలి ముద్ర తీసుకున్న వెంటనే సరుకు ఇవ్వకుండా వారం పది రోజులు వరకు లబ్ధి దారులను తిప్పించి కొని అడిగితేనే సరుకులు ఇస్తున్నారన్నారు. అసలు ఏఏ సరుకులు రేషన్ డిపోల ద్వారా వస్తున్నాయో కూడా తెలియని అయోమయంలో ఉంటున్నామని అన్నారు. అనంతరం వైకెపి ఎపిఒ వెంకటరమణతో ఆ సంస్థకు చెందిన అప్పులు వసూళ్లలో బూసాయవలసలో మహిళలపై జులుం చేస్తున్నారని, సీసీ ఆనంద్ అప్పులు వసూళ్లలో ఇబ్బందులు పెడుతూ అప్పు చెల్లింపు సక్రమంగా లేకపోతే అప్పు తీసుకున్న మహిళల ఫోటోలు ఫ్లెక్సీగా వేసి గ్రామంలోనూ, పంచాయతీ, సచివాలయ ఆఫీసుల్లో ప్రదర్శనగా ఉంచుతామని బెదిరిస్తున్నారని, ఇపుడు ఈ సభ వద్దకు ఆ సీసీని రప్పించాలని డిమాండ్ చేశారు. మహిళల నుంచి అప్పులు వసూళ్లు చేసే పద్ధతి ఇదేనా? అని నిలదీశారు. వెంటనే ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఇలాంటి తప్పులు జరగకుండా ఆ సీసీ పై చర్యలు తీసుకోవాలని ఎపిఎంకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రమామణి, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యారంగం పరిరక్షణకు పోరాడుదా మని యుటిఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి పిలుపునిచ్చారు. దీని కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో బొబ్బిలి మండలం, పట్టణం కౌన్సిల్ సమావేశాలు మంగళవారం సాయంత్రం జరిగాయి. ఈ సందర్భంగా కె.విజయగౌరి మాట్లాడుతూ భవిష్యత్‌లో సిపిఎస్ రద్దు, విద్యారంగ పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపడతామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగుల పక్షాన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కె.రమాప్రభను గెలిపించాలని గ్రాడ్యుయేట్‌లకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా నాయకులు కేశవరావు, శంకరరావు, మధు, పి.సత్యన్నారాయణ, అజయ్ కుమార్‌లతో పాటు మండలం, పట్టణం నాయకులు రమేష్, వెంకటరావు, శ్రీనివాస్, స్వామి నాయుడు, మహేష్, రాధాకృష్ణ, బత్తుల శ్రీనివాస్, ప్రసాద్ పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారులుగా వి.ప్రసన్నకుమార్, కేశవరావు వ్యవహరించారు.

వేపాడ : స్థానిక ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో



సమావేశంలో మాట్లాడుతున్న కె.విజయగౌరి

మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల సిరియా టర్కీ భూకంపలో మరణించిన వారికి, కామ్రేడ్ అమరజీవి నాగేటి నాగయ్య మృతి పట్ల సంతాపం తెలిపారు. అనంతరం ప్రధాన కార్యదర్శి నివేదిక సమర్పించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వెంకట రమణ, జగదీశ్వర్ రావు, గౌరవ అధ్యక్షులు రామసత్యం పాల్గొన్నారు.

వేపాడ నూతన కమిటీ ఇదే

నూతన కమిటీకి గౌరవ అధ్యక్షులుగా రొంగలి రామసత్యం, అధ్యక్షులుగా పి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా ఐ. జగదీశ్వరరావు, సహాయ కార్యదర్శిగా డి ప్రసాద్, కార్యదర్శిగా బి. తులసి, కోశాధికారిగా ఆర్ చల్లమనాయుడు, జిల్లా కౌన్సిలర్‌గా వి భాస్కరరావు, సిహెచ్ దేవి, మరో 9 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

డెంకాడ : యుటిఎఫ్ మండల కార్యవర్గం నూతన ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈనెల 11వ తేదీన జిల్లా కేంద్ర యుటిఎఫ్ కార్యాలయంలో జరగ్గా గౌరవ అధ్యక్షులుగా ఏ ప్రమీలకుమారి, అధ్యక్షులుగా చంద్రరావు, కార్యదర్శిగా కే శోభన్ బాబు, ట్రెజరీగా ఎం ఆదినారాయణను ఎన్నుకున్నారు.

సృజనాత్మక శక్తితో ఆదాయాన్ని పొందాలి

శృంగవరపుకోట: విద్యార్థులు తమ సృజనాత్మక శక్తితో ఆదాయాన్ని పొందాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. ఫిబ్రవరి 14 యూట్యూబ్ ఫౌండేషన్ డేని పురస్కరించుకొని కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి 21వ శతాబ్దంలో సాంకేతిక పరిజ్ఞాన యుగంలో యూట్యూబ్ అనేది ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉండేటువంటి ప్రజలకి చైతన్యాన్ని, విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించడమే కాక విద్యార్థి లోకానికి కూడా యూట్యూబ్ అనేకమైనటువంటి కొత్త కార్యక్రమాలు ద్వారా ఎంతో దోహదకారిగా ఉందన్నారు. అందుచేత విద్యార్థులు యూట్యూబ్ యొక్క విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, ఉన్నత పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. యూట్యూబ్ గురించి బాగా తెలుసుకొని అందులో అందించే వివిధ పాఠ్యాంశాలు, సెమినార్లు, ఉపన్యాసాలు, వర్క్‌షాప్‌లను కూడా విద్యార్థులు ఉపయోగించు కున్నట్లయితే వారు తరగతి విద్యకే పరిమితం కాకుండా కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో మంచి ఫలితాలు సాధించి మంచి ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వాసుదేవరావు, రవీంద్రనాథ్, శ్రీ వలీ ఖాన్, శ్రీలక్ష్మి, ఈరన్న, శ్రీనివాసరావు, భాస్కర్, బి.సంధ్యారాణి పాల్గొన్నారు.

సంస్కృతిని పరిరక్షించుకోవాలి

వేపాడ : జానపద కళలు, తెలుగు భాష సాహిత్య సంస్కృతులను కాపాడుకోవాలని గిడుగు రామ్మూర్తి జానపద కళాపీఠం వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు పిలుపునిచ్చారు. మండలంలోని కేజీపూడి శివారు ఎస్ కోట సీతారాంపురంలో స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో పాశ్చాత్య ధోరణులు పెచ్చుమీరిపోతున్న తరుణంలో ప్రాచీన కాలం నుండి తెలుగు రాష్ట్రాలలో సాంప్రదాయబద్ధంగా ఉన్న యక్ష గానాలు, తోలుబొమ్మలాట, ఒగ్గుకథ, తప్పెటగుళ్ళు, జముకుల పాట, గరగలు, గంగిరెద్దులు, బుడగ జంగాలు, బుర్రకథ, గొరవయ్యలు, థింసా, గుస్సాడి వంటి ఎన్నో జానపద కళలుతో పాటు పలనాడు, బొబ్బిలి యుద్ధం, కాటమరాజు కథలు వంటి చారిత్రక గేయాలు, మరెన్నో స్త్రీల జానపద కళారూపాలు నేడు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. ఈ తరుణంలో వాటికి పునర్జీవం పోసెందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

అందుబాటులోకి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ప్రస్తుతం రైతులు కృత్రిమ వ్యవసాయం చేస్తూ పండిస్తున్న ఆకుకూరలు, కాయగూరలు, వరి తదితర ఉత్పత్తులను కొనుగోలు చేసుకుని తింటున్న ప్రజలకు రైతు సాధికార సంస్థ, వ్యవసాయ శాఖ, ఎపిసిఎన్ఎఫ్ ఎస్‌కోట రైతు బజార్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతు బజార్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలను డిపిఎం అధికారి ఆనందరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గల ఐదు మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ రైతులు పండించిన కాయగూరలు ఆకుకూరలు, రాగులు, సజ్జలు, అరికెలు, బియ్యం, బెల్లం నూనె వేరుశనగ నూనె చిరుధాన్యాలు, కొర్రలు బియ్యం, అరిక బియ్యం, గంటి బియ్యం, ఊద బియ్యం, జొన్నలు, సజ్జలు, దోస పప్పు, కొమ్ము శనగలు, చింతపండు తదితర ఉత్పత్తులను రైతుబజార్ ధరలకే విక్రయాలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కృత్రిమ వ్యవసాయ ఉత్పత్తులను వినియోగిస్తూ ప్రజలు అనేక రోగాలు బారిన పడుతున్నారని ఆయన అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అధిక సంఖ్యలో రైతులు పండించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ వినియోగించి, మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో రవీంద్ర, విఎఎ రవి, పిఆర్‌పి చరణ్, రైతు బజార్ ఈవో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని వెనుకబడిన కులాల జిల్లా సంక్షేమ అధికారి (డిప్యూటీ డైరెక్టర్) పీడిక రత్నం అన్నారు. మండలంలోని సాయిబాబా జంక్షన్ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఎటువంటి కంగారు పడకుండా బాగా వచ్చిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాయాలన్నారు. పరీక్షల సమయం చాలా తక్కువగా ఉన్నందువలన ఇప్పటి నుండి శ్రద్ధగా చదవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న ఉత్తమ విద్యార్థులను 15 మందిని ఎంపిక చేసి మార్చి 14న ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా ఢిల్లీ పార్లమెంటుకు తీసుకువెళ్ళనున్నట్లు వివరించారు. విద్యార్థులు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లు శిధిలావస్థకు గురయ్యాయని ఆమె దృష్టికి 'ప్రజాశక్తి' తీసుకెళ్ళగా నాడు - నేడు పథకం ద్వారా పనులు చేపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌డబ్ల్యుఒ బి రామానందం, సాంఘిక సంక్షేమ వసతి గహాల వార్డెన్లు ఎన్ భాస్కరరావు (లక్కవరపుకోట), డి. సత్యం (శృంగవరపుకోట), సత్యరాగ (వియ్యంపేట), జి. సన్యాసిరావు (గంట్యాడ), కె. రామాంజనేయులు (విజయనగరం)లతోపాటు 26 మంది పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ డైరెక్టర్ రత్నం

రైతులకు అవగాహన

డెంకాడ : మండలంలోని సింగవరం గ్రామంలో రైతులకు నవధాన్యాల సాగుపై అవగగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మంగళవారం వ్యవసాయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, పాల్గొని 'నవధాన్య సాగు చేద్దాం - నేలతల్లికి జీవం పోద్దాం' అనే నినాదాలతో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఎఇఒ రామకోటి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వనజ మాట్లాడుతూ వరి పంట వేయడానికి 45 రోజులు ముందు ఎకరాకు 13కేజీల నవధాన్యాలు వేయడం వల్ల భూమి గుల్ల బడుతుందన్నారు. భూమిలో నీరు, వాతావరణం కాలుష్య తగ్గుతుందన్నారు. పంట దిగుబడి, నాణ్యత పెరుగుతుందన్నారు. నవధాన్యాలు ఎదిగిన 30 రోజుల నుండి పశువులకు పశుగ్రాసంగా వాడితే పాల దిగుబడి, వెన్న శాతం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల యాంకర్ గురుమూర్తి , ఐసిఆర్‌పిలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వెహికల్స్‌పై గెస్ట్ లెక్చర్

డెంకాడ : జోన్నాడ సమీపంలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు విద్యుత్ వాహనాలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా ఐఐటి పాట్నా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రంజన్ కుమార్ బెహరా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ పవర్ ఎలక్ట్రానిక్స్, డ్రైవ్స్‌లో నూతన ఆవిష్కరణలు వస్తాయని, అందుకు ధీటుగా ఎలక్ట్రికల్ ఇంజనీర్లు తయారవ్వాలని చెప్పారు. విద్యుత్ శక్తి యొక్క ఆవశ్యకత, ఎలక్ట్రికల్ వెహికల్స్‌లో రాబోయే రోజులలో వచ్చే మార్పులు అందుకు అవసరమైన బ్యాటరీలు, ప్రత్యామ్నాయ విద్యుత్ శక్తి వనరుల పైన అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ కె.సుబ్బరామయ్యా, సహ విభాగాధిపతి డాక్టర్ బి.వి.యస్ ఆచార్యులు, డాక్టర్ ఎం.మంగరాజు, డాక్టర్ పి.జానకి, డాక్టర్ నరేష్ పాల్గొని వ్యక్తను సత్కరించారు.

ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ ఉద్యోగులు, ఒప్పంద కార్మికుల జీతాలకు ఉద్యోగాలకు ఎసరు పెట్టే ఎపి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన ధర్నాలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మునిసిపల్ పర్మినెంట్ సిబ్బందితో పాటు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల రోజువారి పనికి సంబంధించిన హాజరు విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు జీతాలకే గాక ఉద్యోగాలకు కూడా ఎసరు పెట్టే ప్రమాదం ఉందన్నారు. అందుకే ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సంఘాలతో వెంటనే జాయింట్ మీటింగ్ జరిపి మున్సిపల్ ఉద్యోగుల, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని 2022 జూలై 11 నుండి 15 తేదీ వరకు జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికుల పాల్గొన్నారు.

షూటింగ్ బాల్‌లో ప్రతిభ

రేగిడి : రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ సీనియర్ చాంపియన్ షిప్‌లో సత్తాను చాటారు. 2022-23 చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 10 నుంచి 12 వరకు కృష్ణా జిల్లా భవలపాడు, హనుమాన్ జంక్షన్‌లో నిర్వహించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. పాఠశాల విద్యార్థునులు ఏ.సుమలత, ఎస్.చాందిని, పి.కావ్య, జి.పావనిలు ఆ జట్టులో ఉండి సత్తా చూపారు. వీరికి అక్కడ అధికారులు ప్రజాప్రతినిధులు బంగారు పతకాలు, ప్రశంస పత్రాలు, అవార్డులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఎమ్.రామి నాయుడు, మండల విద్యాశాఖ అధికారి ఎంవి ప్రసాదరావు, గ్రామ సర్పంచ్ కె. రవిశంకర్, విద్యా కమిటీ చైర్మన్ ఎం. రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు వి. చిన్నమ్మడు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. మరిన్ని విజయాలు చేకూర్చాలని వారంతా ఆకాంక్షించారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శారీరక ఆరోగ్యానికి దంత సంరక్షణ అత్యంత ఆవశ్యకమని మేయర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం 11వ డివిజన్‌లోని నగరపాలక సంస్థ పాఠశాల ఆవరణలో ఇండియన్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ మురపాల బాలాజీ నేతృత్వంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డివిజన్ ప్రాంతంలో ఉన్న మహిళలకు, పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఈ శిబిరాన్ని మేయర్ విజయలక్ష్మి ప్రారంభించారు. మహిళలకు, విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ దంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటామని చెప్పారు. ఈ విషయంలో మహిళలు అత్యంత శ్రద్ధగా కనబరిచి, పిల్లల్లో దంతాల పరిరక్షణకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సమాజ హితం కోసం వైసిపి ఎప్పుడూ ముందుంటుందని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా నాయకులు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. మంగళవారం మండలంలోని పడాలపేట గ్రామంలో జరిగిన సువ్వాడ అప్పయ్యమ్మ ప్రథమ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. సువ్వాడ శ్రీను తన తల్లి జ్ఞాపకార్థం వెయ్యి మంది నిరుపేద మహిళలకు ఈశ్వర్ కౌశిక్ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. బిసి సంఘం జిల్లా అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ శశిభార్గవి, ఎంపిటిసి నడిమింటి తులసి, వైస్ సర్పంచ్ గుడ్డాల నరేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భోగాపురం : శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం గ్రామానికి చెందిన బమ్మిడ సత్తిరాజు (30) విశాఖపట్నం నుండి శ్రీకాకుళంలోని అరసవల్లి కుటంబంతో కలిసి మోటార్ సైకిల్ పై మంగళవారం వెళ్తుండగా ఏ రాయివలస జంక్షన్ వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారిపై కుక్క అడ్డగా రావడంతో మోటార్ సైకిల్ అదుపు తప్పింది. దీంతో సత్తిరాజు తలకు బలంగా దెబ్బ తగలడంతో తగరపువలస సమీపంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అప్పటికే పరిస్థితి విషమంచడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య, పిల్లలు గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

గడ్డి కుప్పలు దగ్ధం

వంగర: మండలంలోని బంగారువలసలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డి కుప్పలు, ధాన్యం మిషన్ కాలిపోయాయి. రాజాం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.